కాస్త కూల్‌గా..!


కౌటాలలో కురిసిన వర్షం

- జిల్లాలో ఒక్కసారిగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- శనివారం కురిసిన వర్షం
- నేడు కూడా చిరుజల్లులు పడే అవకాశం

కౌటాల: జిల్లాలో మార్చి చివరి వారం నుంచి ఈ నెల మొదటి వారం వరకు ఎండలు విపరీతంగా మండిపోయాయి. ఒకవైపు అత్యధిక ఉష్ణోగ్రతలు.. మరోవైపు ఉక్కపోత.. వీటికి తోడు వడగాడ్పుల ప్రభావంతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. కానీ గత వారం రోజుల నుంచి జిల్లాలో ఒక్కసారిగా ఎండలు తగ్గాయి. కొన్ని రోజులపాటు భారీగా నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పతనమయ్యాయి. వడగాడ్పుల తీవ్రత సైతం తగ్గడంతో ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. జిల్లాలో ఈ నెల 8న కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, కాగజ్‌నగర్ మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. దీంతో అప్పటి నుంచి జిల్లాలో వాతావరణం చల్లగా మారింది.

వారం క్రితం అధిక ఉష్ణోగ్రతలు

జిల్లాలో ఎన్నాడు లేని విధంగా ఈ సారి మార్చి చివరి వారం.. ఏప్రిల్ మొదటి వారంలో ఎండలు భగ్గుమన్నాయి ఉదయం 8 గంటల నుంచే వేడి ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల తర్వాత బయటకు రాలేనంత తీవ్రమైంది. గతేడాది ఉష్ణోగ్రతల కన్నా ఈసారి ఏప్రిల్‌లో 3 డిగ్రీలపైనే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని పలు మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు చేరుకుంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులు రావడంతోనే గత వారంలో వేడి అమాంతంగా పెరిగిందని నిపుణులు పేర్కొన్నారు. ప్రస్తుతం అల్పపీడనం కారణంగా వర్షాలు కురిసి వాతావరణం కాస్త చల్లబడినా.. ఈ నెలలో మున్ముందు మరింత తీవ్రత ఉండే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో వడగాలులు వీస్తాయని, వృద్ధులు, బాలింతలు, పిల్లలతో పాటు పక్షులపైనా ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

ప్రస్తుతం సాధారణ ఉష్ణోగ్రతలు

జిల్లాలో గత కొద్ది రోజులుగా పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు సాధారణం, కొన్ని ప్రాంతాల్లో అంతకంటే తక్కువగా నమోదవుతున్నాయి. దీంతో వేసవి తాపం నుంచి ప్రజలు కాస్త ఉపశమనం పొందుతున్నారు. శనివారం సైతం జిల్లాలోని కౌటాల మండలంలో చిరుజల్లులు కురిశాయి. దీంతో రోజంతా వాతావరణం చల్లబడింది. నేడు కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అయితే మళ్లీ సోమవారం నుంచి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్నారు.

జిల్లాలో గత వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు..

తేదీ	ప్రాంతం	గరిష్టం	కనిష్టం
08	వంకులం	39.7	24.7
09	కుంచవెల్లి	38.9	23.6
10	ఆసిఫాబాద్	40.8	22.5
11	ఎల్కపల్లి	35.6	23.3
12	ఎల్కపల్లి	39.2	27.0
13	కౌటాల	31.0	22.5

క్లుప్తంగా

బీజేపీలోకి ఎంపీటీసీ రాజన్న


రాజన్నను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ ఎంపీటీసీ దూగుంట రాజన్న బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి చేరగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి గొడం నగేశ్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం బీజేపీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఘనపురం నగేశ్, జునుగరి మధుకర్, కోసరి మధు, చౌదరి సత్తయ్య, చింతపూడి సత్తయ్య, జంగం శంకర్, పోషన్న, బాబాజీ తదితరులు ఉన్నారు.

15న బీజేపీ బూత్ సమ్మేళనం

కాగజ్‌నగర్‌రూరల్: ఈనెల 15న పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ బూత్ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్‌బాబు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమానికి బీజేపీ బూత్ అధ్యక్ష, కార్యదర్శులు, కోఆర్డినేటర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

కోనప్ప ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: మాజీ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్ ఆరోగ్యం కుదుటపడాలని శనివారం పట్టణంలోని ఇర్ఫానగర్ దర్గాలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్, కౌన్సిలర్లు వలీ, నిజావుద్దీన్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, మండల కోఆప్షన్ సభ్యులు బాబా, నాయకులు వసీం, వనమాల రాము, ప్రసాద్, నాజీర్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వేడుకలు


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కౌటాల: మండల కేంద్రంలోని కోయగూడ కాలనీలో గల నజరేత్ మిషన్ ప్రైవేట్ పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ అన్యూవల్ డే వేడుకలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ స్టీవెన్‌సన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చిన్నతనం నుంచే క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు అందరిని ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు ప్రశాంతి, పార్వతి, అనుషరాణి, హెప్సిబా, కీర్తి, విలాసిని, మమత, దేవదాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత


ప్యాడ్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనిత

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు స్నేహ పూర్వకంగా ఒకరికొకరు పోటీపడి చదవాలని ప్రిన్సిపాల్ అనిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో అమ్మ శ్రీకాంత్ చారిటబుల్ ట్రస్టువారు 9వ తరగతి విద్యార్థులు 76 మందికి అందజేసిన పెన్నులు, పరీక్ష ప్యాడ్లను వారికి పంపిణీ చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్ గ్రామపంచాయతీ పరిధిలోని లింగపూర్(సంగరంగూడ)లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజ కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఇచ్చోడ మండలంలోని మాధపూర్ గ్రామానికి చెందిన నారాయణ మహరాజ్, కెరిమెరి మండలానికి చెందిన కుల్‌కార్ని మహరాజ్‌ల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలను చేపట్టారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయాణించాలన్నారు. భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు సెల్కే వెంకట్‌రావ్, నాందురే జనార్దన్, సెల్కే మారుతి, సెల్కే అనిరుద్, నాందురే మనోహర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరమ్మతులు ప్రారంభం


సాంగ్వి పాఠశాలలో ఫ్యాన్ రిపేర్ చేస్తున్న సిబ్బంది


పనులు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

కెరమెరి: మండలంలోని వివిధ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం మరమ్మతులు ప్రారంభించారు. పాఠశాలల వారీగా అవసరమైన పనులను గతంలోనే గుర్తించగా.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. మరుగుదొడ్ల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్ల రిపేర్లు తదితర మరమ్మతులు చేపట్టారు.

పాఠశాలలో అమ్మ ఆదర్శ పనులు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్డి నిర్మాణానికి హెచ్‌ఎం సుభాష్, చైర్‌పర్సన్ స్వరూపరాణితో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరైన నిధుల నుంచి పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు, మేజర్ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా బూర్గుడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్యాంసుందర్, చైర్‌పర్సన్ మౌనికతో కలిసి పాఠశాలలో తాగు నీటి పథకం పనులు ప్రారంభించారు. సీఆర్‌పీ తిరుపతి పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న శాంతికుమారి

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి కోరారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రజాసంఘాల కార్యాలయం వద్ద టీఎస్ యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూటీఎఫ్ అనేక పోరాటాలు చేసి సమస్యల పరిష్కారంలో అగ్రగామి సంఘంగా ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో అలుపెరగని పోరాటం చేస్తోందని చెప్పారు. కోకన్వీనర్ నరేశ్ మాట్లాడుతూ.. కరోనా, వరద బాధితులు, అనేకమంది ఉపాధ్యాయులకు ఆర్థికసాయం అందించిందని పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు మహిపాల్, ప్రధాన కార్యదర్శి పుల్లూరు బాలు, నాయకులు సుందిళ్ల రమేశ్, నయీం, సుచరిత, మానస, సాయికృష్ణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశ దీక్షలు


కేస్లాపూర్ హనుమాన్ మందిర్‌లో దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ మందిర్‌లో శనివారం హనుమాన్ భక్తులు భక్తి శ్రద్ధలతో ఏకాదశ దీక్షలు స్వీకరించారు. అర్చకులు శిరీశ్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ దీక్షా నియమాలు వివరించి, సుమారు 350 మంది భక్తులకు మాలాధారణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండ వెంకన్న, ప్రతినిధులు రాధాకృష్ణ చారి, డాక్టర్ మధు, ప్రకాశ్‌గౌడ్, నారాయణ మూర్తి, ఎకిరాల సతీశ్, చెట్ల రాజు, భక్తులు పాల్గొన్నారు.

హత్తినిలో హనుమాన్ శోభాయాత్ర


మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో శనివారం ఆంజనేయ స్వాముల మాలధారణ దీక్షాదారులు శనివారం హనుమాన్ శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకులు నరేశ్ చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్ర గ్రామంలో అన్ని వీధుల గుండా కొనసాగింది. కార్యక్రమంలో ఆంజనేయ భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'సాలేగూడ'లో పారిశుద్ధ్య లోపం


సాలేగూడలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

- పూడికతో నిండిన డ్రెయినేజీలు
- రోడ్డుపైనే మురుగునీరు
- దుర్గంధం వ్యాపిస్తున్న ఎస్సీ కాలనీ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని సాలేగూడ గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

రోడ్డుపైనే మురుగు..


సాలేగూడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో 25 కుటుంబాలు ఉన్నాయి. గతంలో నిర్మించిన డ్రెయినేజీల పూడిక తొలగించకపోవడంతో నీరంతా రోడ్డుపైనే పారుతోంది. మురికి నీరు రోడ్డుపై చేరి కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.


చెత్తాచెదారంతో డ్రెయినేజీ

పెండింగ్‌లో వేతనాలు..

గ్రామ పంచాయతీల్లో పని చేసే జీపీ కార్మికులు గత మూడు నెలల నుంచి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రోజు వారీగా డ్రెయినేజీ శుభ్రం చేయడం, చెత్తాచెదారం తొలగించడం వంటి పనులు మందగించాయి. జనవరిలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ట్రాక్టర్ నిర్వహణకు డబ్బులు లేక కొన్ని గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లు నడపడం లేదు. దీంతో గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ కుంటుపడింది. ప్రత్యేక అధికారులను నియమించినా ఒకరికి రెండు నుంచి మూడు జీపీలు కేటాయించడం.. జీపీల నిర్వహణకు నిధులు మంజూరు కాకపోవడంతో కార్మికులకు వేతనాలు ఇవ్వని పరిస్థితులు ఉన్నాయి.


పట్టించుకోవడం లేదు



మా కాలనీలో మురికి నీరు రోడ్డుపై పారుతోంది. డ్రెయినేజీలను శుభ్రం చేయాలని జీపీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

- రుకుంబాయి, సాలేగూడ

రోగాల బారిన పడుతున్నాం



ఎస్సీ కాలనీలో మూడు నెలల నుంచి డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నాం. డ్రెయినేజీలు శుభ్రం చేయాలి.

- చాపిడి సురేశ్, సాలేగూడ

బెంగాలీల ఉగాది.. పోయ్‌లా బైశాఖి


శివుడికి పూజలు చేస్తున్న బెంగాలీలు

- నేడు బెంగాలీలకు కొత్త సంవత్సరం
- రెండు రోజుల పాటు వేడుకలు

చింతలమానెపల్లి: పోయ్‌లా బైశాఖి.. బెంగాలీల నూతన సంవత్సరాది. సిర్పూర్ నియోజకవర్గంలోని బెంగాలీలు జరుపుకునే ప్రధాన పండుగ. ఆదివారం బెంగాలీలు తమ సంప్రదాయ నూతన సంవత్సరాదిని ఘనంగా జరుపుకోనున్నారు. పోయ్‌లా అనేది పెహలా అనే హిందీ పదం నుంచి వచ్చింది. బైశాఖీ అనేది సంవత్సరంలో వచ్చే మొదటి నెలను తెలుపుతుంది. వైశాఖ మాసానికి హిందు సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉంది. వైశాఖమాసంలో సంవత్సరం ప్రారంభమవుతుందని ఈనెల ప్రారంభాన్ని నూతన సంవత్సరాదిగా బెంగాలీలు జరుపుకుంటున్నారు.

సంప్రదాయం ప్రకారం..

ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 13, 14, 15 తేదీలలో బెంగాలీ నూతన సంవత్సరం వస్తుంది. బెంగాలీలు తమ సంప్రదాయాలను పాటిస్తూ, సంస్కృతి, విశ్వాసాల ప్రకారం వేడుకలు నిర్వహిస్తారు. సంప్రదాయ వంటలు, సంస్కృతిలో భాగమైన కార్యక్రమాలు, భక్తి విశ్వాసాలను పాటిస్తారు. బెంగాలీల సాంప్రదాయ వంటకాలు మిష్టాన్నం, రసగుల్లా, రాజ్‌భోగ్‌లను పండుగల్లో భాగం చేస్తారు. రెండు రోజుల పాటు మద్యం, మాంసాలకు దూరంగా ఉంటారు.

దేవతలకు పూజలు..

పోయ్‌లా బైశాఖి పండుగను బెంగాలీలు రెండు రోజుల పాటు జరుపుకుంటారు. మహాదేవుడు శివుడికి భారీ ఎత్తున పూజలు నిర్వహిస్తారు. తారక్‌నాథ్ రూపంలో బెంగాలీల ప్రత్యేక దైవానికి సామూహికంగా పూజలు నిర్వహించి సంవత్సరానికి వీడ్కోలు పలుకుతారు. వైశాఖ మాసం మొదటి రోజు ఆదిదేవుడు గణపతి, లక్ష్మీదేవికి, దుర్గాదేవీలకు ఇళ్లల్లో పూజలు నిర్వహించి సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. భగవతి పూజలో భాగంగా ఇళ్లలో పశువులకు పూజలు చేస్తారు. తులసీమాతకు జలాభిషేకం నిర్వహించి గంగాపూజ నిర్వహిస్తారు. కొత్త సంవత్సరం సందర్భంగా బెంగాలీలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నూతన కార్యక్రమాలు చేపట్టడం, వాహనాల కొనుగోలు, నూతన గృహ నిర్మాణాలు ప్రారంభించడం, గృహ ప్రవేశం, వ్యాపారస్తులు తమ వ్యాపార వాణిజ్య ఖాతా పుస్తకాలను ప్రారంభించడం వంటివి చేస్తారు.


బెంగాలీల సంప్రదాయ నైవేద్యంతో పూజలు

బెంగాలీ గ్రామాలలో సందడి..

పోయ్‌లా బైశాఖి సందర్భంగా సిర్పూర్ నియోజకవర్గంలోని బెంగాలీ గ్రామాలలో సందడి నెలకొంది. ప్రత్యేక అలంకరణతో ఆలయాలు, గృహాలు వెలిగిపోతున్నాయి. స్థానికులకు బెంగాలీలు ఆతిథ్యం ఇచ్చి తమ ప్రత్యేకత చాటుకోనున్నారు. నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాం, నజ్రుల్‌నగర్, నామానగర్, సీతానగర్, చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్, సిర్పూర్(టి) మండలంలోని లక్ష్మీపూర్ గ్రామాలు పండుగ వేడుకలకు వేదికగా ఉన్నాయి.

సంప్రదాయాలు కాపాడుకోవాలి



బెంగాలీలుగా మా పూర్వీకుల సంప్రదాయాలను కాపాడుకుంటున్నాం. పండుగలకు ప్రత్యేక సందర్భాలలో స్థానికులను ఆహ్వానించి ఆతిథ్యం ఇస్తాం. పండుగలతో మంచి వాతావరణం ఉంటుంది.

- సమీర్‌గుప్తా, ఈస్‌గాం

ఎంతో ప్రత్యేకం



మాకు ఈ పండుగ ఎంతో ప్రత్యేకం. సంప్రదాయబద్ధంగా పండుగ జరుపుకుంటాం. నూతన సంవత్సరాదికి స్వాగతం పలుకుతాం. భక్తితో దేవతలకు పూజలు చేస్తాం. పండుగ జరుపుకుంటే ఏడాది మొత్తం శుభం కలుగుతుంది.

- మాధవి మండల్, రవీంద్రనగర్

వైశాఖ మాసం ఎంతో పవిత్రం

వైశాఖ మాసం ఎంతో పవిత్రమైనది. వాతావరణంలో మార్పులను తెలియజేసే ఈమాసం మానవాళికి సందేశాన్ని ఇస్తుంది. ప్రకృతికి గౌరవం ఇవ్వాలని సూచిస్తుంది. ఇలాంటి ప్రత్యేకమైన సందర్భంలో దేవుళ్లను పూజించి, పండుగ ఘనంగా జరుపుకుంటాం.

- బాసుదేవ్ చక్రవర్తి, పూజారి, రవీంద్రనగర్

విదేశీ కరెన్సీ ప్రదర్శన

నేరడిగొండ: బోథ్ మండలంలోని సాకెర గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సొనాల గ్రామానికి చెందిన బాశెట్టి రాజ్ కుమార్ విదేశీ కరెన్సీ నోట్లను ప్రదర్శించారు. వాటి విలువను తెలియజేశారు. అనంతరం గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుషా, ఉపాధ్యాయుడు కమలాకర్, శ్రీరామ్‌విజయ్, అంగన్‌వాడీ కార్యకర్త సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతం చేయండి

ఎదులాపురం: శ్రీరామ నవమిని పురస్కరించుకుని అంతర్జాతీయ కృష్ణ చైతన్య మండలి (ఇస్కాన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఇస్కాన్ ప్రతినిధి ప్రేమ్‌నర్తన్ దాస్‌జీ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని రాంపూర్‌రోడ్‌లోని ఇస్కాన్ ఆలయంలో ఈనెల 15, 16, 17వ తేదీల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పల్లకి సేవ, కీర్తనలు, సీతారాముల కల్యాణం కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఇస్కాన్ ప్రతినిధులు పూర్ణ చంద్ర కృష్ణప్రభు, గిరివరదాస్, ప్రమోద్ ఖత్రి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి


ఎండీఎంను పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని సుల్తాగూడ ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులకు 15 నుంచి ఎస్‌ఏ 2 పరీక్షలు ఉన్నాయన్నారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి గ్రేడులు సాధించాలని పేర్కొన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని టీచర్లకు సూచించారు.